# సింహావలోకనం

**"రాయల సీమ కథలు - క్షామ చిత్రణ"** అనే ఈ సిద్ధాంత గ్రంథం రాయలసీమ కథకులు సీమ సమగ్ర జీవిత చిత్రాన్ని ఏవిధంగా ఆవిష్కరించారో ఇప్పటిదాకా పరిశీలించాం. ఈ విశ్లేషణ సారాంశాన్ని ఒకసారి సింహావలోకనం చేసుకుందాం.

ఈ సిద్ధాంతవ్యాసం ఆరు అధ్యాయాలుగా విభజించబడింది. **"రాయలసీమ - చారిత్రక భౌగోళిక నేపథ్యం"** అనేది మొదటి ప్రకరణం. ఈ అధ్యాయంలో రాయలసీమకు సంబంధించిన చారిత్రక, భౌగోళిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాం. రాయలసీమలో ఉన్న చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు ఎప్పుడు ఏర్పడ్డాయో, ఏవిధంగా రూపొందించబడ్డాయో గుర్తించాం. పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో ప్రాంతాలకు సంబంధించి మన రాష్ట్రంతో ఏవిధమైన సర్దుబాట్లు జరిగాయో కూడా గమనించాం. రాయలసీమ ప్రాంతానికి సంబంధించి క్షామ సంబంధమైన చారిత్రక అంశాలను కూడా గుర్తించాం. ఆర్థికంగా, సామాజికంగా రాయలసీమ ప్రాంతం సహజంగానే ఎందుకు వెనకబడి పోయిందో తెలుసుకోడానికి ఈ అధ్యాయం ఒక నేపథ్యంగా ఉపయోగపడింది.

**"కరవు - క్షామం"** అనేది ఈ సిద్ధాంత గ్రంథంలో రెండో అధ్యాయం. కరవు, క్షామం అనే పదాలను సమానార్థకాలుగా సాధారణ వ్యవహారంలో వినియోగించుకుంటున్నాం. కానీ, ఈ రెంటికీ మధ్య ఉన్న భేదాన్ని ఈ అధ్యాయంలో పరిశీలించాం. కరవు అనే పదాన్ని నిర్వచించుకొని, ఈ పదం నిఘంటువుల్లో ఏయే అర్థాలలో ఉటంకించబడిందో గమనించాం. తెలుగు సాహిత్యంలో 'కరవు' పదం ఎక్కడెక్కడ ఏయే అర్థాలలో ప్రయోగించబడిందో కూడా

పరిశీలించాం. కరవులో ఉన్న రకాలను గమనించి, సామాజిక జీవితంలో కరవు ఏర్పడటానికి దారి తీస్తున్న కారణాలను కూడా ప్రస్తావించుకున్నాం. ఈ సిద్ధాంత గ్రంథం సమగ్ర రూపానికి ఈ అధ్యాయం కూడా ఒక బలమైన భూమికగా నిలిచింది.

ఈ సిద్ధాంత గ్రంథంలో **"తెలుగు కథ – సీమ కథకులు"** అనేది మూడవ అధ్యాయం. కథానిక ప్రక్రియకు సంబంధించిన సాధారణ అంశాలను అవసరమైనంత వరకు ఇక్కడ ప్రస్తావించుకున్నాం. తెలుగు సాహిత్యంలో రాయలసీమ సాహిత్యం స్థితిగతులను స్థూలంగా గమనించాం. కథా ప్రక్రియ రాయలసీమలోకి చాలా ఆలస్యంగా అడుగు పెట్టిన వాస్తవాన్ని కూడా గుర్తించాం. అయినప్పటికీ సీమ ప్రాంతంలో కథా బీజం ఆలస్యంగా అంకురించినా; ఎంత బలంగా, ఎంత వేగంగా ఆ ప్రక్రియ అభివృద్ధి చెందిందో కూడా గమనించాం. రాయలసీమ ప్రసిద్ధ కథకుల గురించి, వారి కథల గురించీ జిల్లాలవారీగా ఈ అధ్యాయంలోనే పరామర్శించుకున్నాం.

**"రాయలసీమ కథా సాహిత్యం – రైతు జీవితం"** అనేది ఈ సిద్ధాంత గ్రంథంలో నాల్గవ ప్రకరణం. రాయలసీమలో ప్రధానంగా ఉన్నది గ్రామీణ జీవితం. వ్యవసాయమే గ్రామీణుల ప్రధాన వృత్తి. క్షామం పంజరంలో చిక్కుకుని విలవిల లాడుతున్నది ప్రధానంగా వ్యవసాయదారులే. అందువల్ల రాయలసీమ కథకులు రైతు జీవితాన్ని ఏ విధంగా చిత్రించారో ఈ అధ్యాయంలో ప్రత్యేకంగా పరిశీలించాం. వ్యవసాయానికి సంబంధించి అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటిలో ప్రధానమైనవి. నీటి సమస్యలు, పశు సమస్యలు, వలస సమస్యలు, వృత్తి పనుల సమస్యలు వంటివి. అందువల్ల వీటిని గురించి ఈ అధ్యాయంలో ప్రత్యేకంగా పరిశీలించాం.

వర్తమాన సామాజిక జీవితాన్ని ఆవిష్కరించడానికి కథానిక ప్రక్రియ బాగా అనువైంది. ఈ విషయాన్ని సీమ కథకులు సమర్థవంతంగా నిరూపించారు. రచయితలు ఆయా సమస్యలకు సంబంధించి సంపూర్ణ అవగాహనతో తమ కథలను తీర్చిదిద్దిన అంశాన్ని కూడా గుర్తించాం. రైతుల సమస్యలకు సహజంగా ఉన్న ప్రకృతి సంబంధమైన కారణాలనే కాక; సమాజగతమైన, పాలనాపరమైన కారణాలను కూడా కథకులు తమ కథలలో విశ్లేషించారు. రైతుల జీవితాలు మెరుగుపడటానికి కథకులు అవసరమైన కొన్ని శాస్త్రీయమైన సూచనలు కూడా చేశారు. వీటన్నింటినీ ఈ అధ్యాయంలో సమీక్షించుకున్నాం. రైతుల జీవితాలను శాస్త్రీయంగా పరిశీలించడంలో సీమ రచయితలు కథానిక ప్రక్రియను ఎంత బలంగా వినియోగించుకున్నారో ఈ అధ్యాయంలో గుర్తించాం.

**“రాయలసీమ కథా సాహిత్యం - సామాజిక సమస్యలు”** అనేది ఈ సిద్ధాంత గ్రంథంలో ఐదవ అధ్యాయం. రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాల్లో రైతులదే ప్రముఖమైన స్థానం. అయినప్పటికీ కేవలం రైతుల జీవితం, వారి సమస్యలే మొత్తం సామాజిక జీవితం, సామాజిక సమస్యలు కావు. ఇతరేతర వృత్తులకూ, ప్రవృత్తులకూ చెందిన ఇతరులు కూడా సమాజంలో అంతర్భాగమై ఉంటారు. రాయలసీమ వంటి ప్రాంతాల్లో కేవలం రైతులకే కాక, ఇతరులకూ అనేక సమస్యలు సహజంగానే ఉంటాయి. అటువంటి సమస్యలన్నింటినీ ఈ అధ్యాయంలో పరిశీలించాం. రాయలసీమ కథా సాహిత్యంలో ప్రధానంగా చిత్రించబడినవి – కుటుంబ సమస్యలు, మానవ సంబంధాల విధ్వంసం, దళిత సమస్యలు, స్త్రీల సమస్యలు, మూఢ నమ్మకాలు, చదువు సమస్యలు, ముఠా కక్షలు, అప్పులు – పెట్టుబడులు, ఉత్పత్తులు – పంపిణీ వ్యవస్థ, నైతిక విలువల పతనం వంటివి ముఖ్యమైనవి.

సీమకథకులు రైతుల సమస్యలను ఎంత శాస్త్రీయంగా పరిశీలించి విశ్లేషించారో పైన ప్రస్తావించిన ఇతరేతర సమస్యలను కూడా అంతే శాస్త్రీయంగా ఆవిష్కరించారు. సీమ కథకుల సామాజిక అవగాహనా బలాన్నీ, అందుకు కథా ప్రక్రియను బలంగా వినియోగించుకున్న తీరునూ ఈ అధ్యాయంలో కూడా గుర్తించాం.

ఈ సిద్ధాంత గ్రంథంలో **"రాయలసీమ కథకులు - కథన శిల్పం"** అనేది ఆరవ అధ్యాయం. ఇదే చిట్ట చివరిది. కథానికా శిల్ప లక్షణాలను సీమ కథల్లో అన్వయించి ఈ అధ్యాయంలో విశ్లేషించుకున్నాం. రాయలసీమకు ఒక ప్రత్యేకమైన భాష, యాస ఉన్నాయి. దీనినే రాయలసీమ మాండలికం అంటున్నాం. సీమకథల్లో సహజంగానే ఆవిష్కృతమైన ఈ మాండలిక స్వభావాన్ని కూడా ఈ అధ్యాయంలో పరిశీలించాం.

రాయలసీమ వెనుకబడి ఉండడానికి దారితీసిన పరిస్థితులనూ; ఈ వెనుకబాటు మూలంగా రాయలసీమ జనజీవితంలో పెనవేసుకొని పోయిన అనేక సమస్యలనూ ఈ సిద్ధాంత గ్రంథంలో వివిధ అధ్యాయాలలో పరిశీలించాం. ఆ సమస్యల నివారణకు సీమ కథకులు చేసిన సూచనలతో పాటు మరికొన్ని అంశాలను కూడా ఆయా సందర్భాలలో నేను వ్యాఖ్యానించాను. ఇవేకాక, రాయలసీమ అభివృద్ధికి నా పరిశీలనలో నా అవగాహనకు వచ్చిన మరికొన్ని సూచనలను కూడా ఇక్కడ ప్రస్తావించడం సముచితమని భావిస్తున్నాను.

రాయలసీమ ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలు ఒక్కరోజులో పరిష్కారం అయ్యేవి కావు. ప్యాకేజీలు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు వల్ల మాత్రమే రాయలసీమ వెనుకబాటు పోదు. హఠాత్తుగా ప్రగతి చేకూరదు. వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసుకోవడం ద్వారా రాయలసీమ సుభిక్షం అవుతుంది. అయితే ఇది దీర్ఘకాలిక ప్రక్రియ.

* కృష్ణా, తుంగభద్రా, పెన్నా నీరుని అన్ని నదులతో అనుసంధానం చేసి, చెరువులకు నీరును పంపే ప్రక్రియ చేపట్టాలి.

* స్వల్పకాల అవసరాలు తీర్చే ఊటనీరు బావులు, చెక్ డ్యాములు, ఇంకుడు గుంటలను గూర్చి వ్యవసాయ కుటుంబాల, గ్రామాల మధ్య పరిపూర్ణ అవగాహన తీసుకురావాలి.

* విస్తారమైన కొండలమీద అడవులను పెంచి, వన్య ప్రాణులను వృద్ధి చేయడం వల్ల ఆదివాసులకు, అడవుల చుట్టుప్రక్కల ఉండే గ్రామ, నగరాలకు కలప, ఆహార అవసరాలను తీర్చవచ్చు. వన సంరక్షణ పథకాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది.

* ఇనుప, రాగి, సున్నపురాయి, గ్రానైట్, ఖనిజాలను త్రవ్వి వాటిమీద వచ్చే ఆదాయాన్ని ఆ స్థానిక ప్రాంత అభివృద్ధి మీదనే ఖర్చు చేయాలి.

* ముఠా కక్షలు రాయలసీమ అభివృద్ధికి నిరంతర ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. వీటిని రూపుమాపడానికి పోలీసు మరియు రాజకీయ నాయకుల జోక్యం అవసరం.

* వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు ఆ ప్రాంతంలోనే స్థాపించాలి. ఎగుమతులకు అక్కడి రైతులకు పూర్తి స్వేచ్ఛ యివ్వాలి.

* గ్రామీణ పరిశ్రమలు గతంలో సాంప్రదాయ పద్ధతులలో ఉండేవి. ప్రస్తుతం అవి క్షీణించాయి. వాటిని తిరిగి పునరుద్ధరణ చేయాలి. దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించాలి.

* వ్యవసాయ రంగం మీద పెట్టుబడులు పెట్టి ఆధునీకరణను పెంచి, అధిక దిగుబడులు వచ్చేటట్లు చేయాలి.

* ప్రభుత్వ పరపతి సంస్థలు రైతును వెన్నుతట్టి, పరిపూర్ణ స్థాయిలో రుణాలు ఇచ్చి, వారి ఉత్పత్తులను బ్యాంకులే మార్కెట్‌లో అమ్మి, వారి అప్పులను జమచేసుకోవాలి.
* ఉత్పత్తుల పంపిణీ విధానంలో మార్పులు రావాలి. రైతుల ఉత్పత్తులను వారి పొలంలోనే కొనేటట్లు చేయాలి.
* వనరుల కేటాయింపులో రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ, వ్యవసాయానికి మరింత ప్రాధాన్యతను ఇవ్వాలి.
* రైతులకు అందిస్తున్న బ్యాంకు రుణాలను గణనీయంగా విస్తరింప చేయాలి.
* ప్రభుత్వ నిర్వహణలో ఉన్న గొట్టపు బావుల్ని నిర్ణీత గడువులోగా బాగు చేయడం, అవసరమైన ప్రాంతాల్లో కొత్త బావులు వేయడం చేయాలి.
* బంజరు భూముల అభివృద్ధి కార్యక్రమాన్ని పునరుద్ధరించాలి.
* రైతులందరికీ గిట్టుబాటు ధరలు లభించే చర్యలు తీసుకోవాలి.
* వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు అందించి, వారి హక్కుల పరిరక్షణకు సమగ్ర చట్టాన్ని రూపొందించాలి.
* భూగర్భ జలాలను పెంచేందుకు జాతీయ స్థాయిలో వర్షపు నీటి రక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలి.
* కరవు ప్రాంతాల్లోని రైతుల, రైతు కూలీల వలసలు అసంఖ్యాకంగా కొనసాగుతున్నాయి. వాటిని అరికట్టాలంటే ఆయా ప్రాంతాలలో కానీ, సమీప పట్టణాలలోకానీ వారికి పని కల్పించాలి.

* కరవు ప్రాంతాలలో విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. ఫీజులలో రాయితీలు కల్పించాలి.

* మార్కెట్ యార్డ్, కమిటీలలో, దళారీల మోసాలకు రైతులు బలి కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి అమలు చేయాలి.

రాయలసీమ నాయకులు మధ్య ఉండే అనైక్యత వలన రాయలసీమ ప్రజలు అభివృద్ధి ఫలాలకు నోచుకోలేదు. మెకంజీ ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం, శ్రీబాగ్ ఒడంబడికలు అమలుకాక పోవడం; ఒకప్రక్క కరవు కాటకాలు, నిరక్ష్యరాస్యత, అంటువ్యాధులు, ఆకలి మంటలు, పేదరికం, నిరుద్యోగం, ముఠాకక్షలు మరోప్రక్క రాయలసీమ దైనందిన జీవితాన్ని దుర్భరంగా మారుస్తున్నాయి.

రాయలసీమ ప్రాంతమంతా ఆకలి, పేదరికం, నిరుద్యోగం దట్టంగా కనబడుతున్నాయి. రాయలసీమలో తక్కువ వ్యయంతో ఎక్కువ ఉత్పాదకతను సాధించాలంటే వ్యవసాయరంగంలో యాంత్రికీకరణ ప్రక్రియను ముమ్మరం చేయాలి. ఈ యాంత్రికీకరణ వల్ల రైతులు సకాలంలో పనులు పూర్తి చేయగలుగుతారు. దానితో అధిక ఉత్పత్తి సాధ్యమవుతుంది. చిన్న సైజు కమతాల్లోనూ వ్యవసాయ యాంత్రికీకరణ కష్టం కాదు. వ్యవసాయ యంత్రాల దిగుమతులపై సుంకం విధించకుంటే వాటి రేట్లు చాలా వరకు తగ్గిపోతాయి. రాయలసీమలో వ్యవసాయ యంత్రాల వినియోగం చిన్న కమతాలకు చక్కగా ఉపయోగపడతాయి. ఇలాంటి యాంత్రికీకరణ రైతులను, రైతు కూలీలను దెబ్బతీయదు. పైగా పని గంటలకు అదనపు విలువ చేకూరుతుంది. రైతుల శ్రమను, అలసటలను తగ్గిస్తుంది.

భూసారం దెబ్బ తినకుండా చర్యలు చేపట్టడం, చీడల నివారణ, సేంద్రీయ పదార్థాల పునర్వినియోగం, నీటి సంరక్షణ, సూర్యరశ్మి వినియోగం, పచ్చని చెట్ల పెంపకం వంటి సమీకృత వ్యూహాలతో రాయలసీమ రైతులు కదలాలి. ఈ మేరకు ప్రభుత్వం రాయలసీమ రైతుల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలి. అధిక ఉత్పాదకత సాధించడానికి ముఖ్యమైన రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రైతులకు అందేటట్లు చూడాలి. ఈ వనరులను సమర్థవంతంగా ఉపయోగించేలా చూడాలి. పర్యావరణానికి హాని కలుగకుండానే రాయలసీమ ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చడానికి ఇలాంటి చర్యలు దోహదం చేస్తాయి. రాయలసీమలో భూమి, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడం ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభించే విధంగా చర్యలు తీసుకోవాలి. బంజరు భూములను ఉపయోగంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి.

రాయలసీమ వంటి కరవు పీడిత ప్రాంతాలలో నీటి సమస్య పరిష్కారం ఒక్క ప్రభుత్వంతో అయ్యే పనికాదు. ప్రకృతి ప్రసాదిస్తున్న నీటిని ఉచిత వనరుగా భావిస్తుండబట్టే నీరు దుర్వినియోగ మవుతోంది. రాయలసీమలో వర్షపాతం రుతుపవనాల మీద ఆధారపడి ఉంది. రుతుపవనాల తీవ్రత, కాలవ్యవధి తరచూ మారుతూ ఉండడం వల్ల అతివృష్టి, లేదంటే అనావృష్టి సహజమై పోయాయి. అతివృష్టి సమయాలలో వరదలను అరికట్టేందుకు డ్యాములను నిర్మించడం, నిల్వ చేసిన నాటిని క్రమబద్ధంగా కాల్వల ద్వారా మళ్ళించడం వల్ల ఆయకట్టు ప్రాంతాలలో పంటలు పండుతాయి. తద్వారా రాయలసీమ ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

ఈ సిద్ధాంతగ్రంథం కేవలం రాయలసీమ కథలకు మాత్రమే పరిమితమైంది. భవిష్యత్తులో పరిశోధకులు రాయలసీమకు చెందిన నవలలలో కూడా రచయితలు క్షామ జీవితాన్ని ఏవిధంగా చిత్రించారో పరిశోధించవలసి ఉంది. అపుడు మరికొన్ని అంశాలు వెలుగులోకి రాగలవు. ఇదేవిధంగా తెలంగాణా, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాలకు చెందిన కథలనూ, నవలలనూ ఇదే దృష్టితో పరిశీలించవలసి ఉంది. ప్రజాజీవితానికి సంబంధించిన కొన్ని పార్శ్వాలను కొందరు పరిశోధకులు కొంతమేర ఇప్పటికే పరిశీలించారు. కానీ ప్రజా సమస్యలకు సంబంధించిన సమగ్ర పరిశోధనలు జరగలేదు. అటువంటి సిద్ధాంత గ్రంథాలు కూడా వెలువడినపుడు రచయితలకు వర్తమాన ప్రజా జీవితాల పట్ల ఉన్న నిబద్ధతనూ, అవగాహననూ నిర్దిష్టంగా అంచనా వేయగలం. సమీప భవిష్యత్తులోనే ఆ ప్రయత్నం జరుగుతుందని ఆశిస్తున్నాను. అందుకు నేను రూపొందించిన ఈ సిద్ధాంత గ్రంథం ఒక నమూనాగా ఉండగలిగితే ఈ నా కృషి ఫలించినట్టుగా భావిస్తాను.

* * *